క్లుప్తంగా

ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

కృత్తివెన్ను: లక్ష్మీపురం పల్లెపాలెం గ్రామంలో గణపతి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. యువతలో దాగున్న ప్రతిభను వెలికితీసేలా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేలు, మూడవ బహుమతి రూ. 5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన చాలా మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు.

నిరుపేదలకు కుట్టుమిషన్, నగదు పంపిణీ

చల్లపల్లి: పంచాయతీ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్‌కుమార్ పి-4 పథకంలో భాగంగా ఒకరికి కుట్టు మిషన్, మరోకరికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణల సమక్షంలో శుక్రవారం అందజేశారు.

విద్యార్థులకు పోటీలు

చల్లపల్లి: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు శుక్రవారం తెలుగుభాషపై పలు పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పద్య పఠనం, వ్యాసరచన, ఆంగ్ల పదం రాకుండా రెండు నిమిషాలపాటు అనర్గళంగా తెలుగులో మాట్లాడటం వంటి పోటీలు ఏర్పాటుచేశారు. అధ్యాపకులు ఓలేటి ఉమా సరస్వతి, రాణి పర్యవేక్షించారు.

నేడు రక్తదాన శిబిరం

చల్లపల్లి: స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్న శ్రీమంతురాజా యార్లగడ్డ శివ రామప్రసాద్ బహదూర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. కళాశాల పూర్వ అధ్యాపకులు తగిరిశ సాంబశివరావు మాస్టారు పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్న చెప్పారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

పెదప్రోలు(మోపిదేవి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రైస్ కార్డులు పీఏసీఎస్ చైర్ పర్సన్ నాదెళ్ల శరత్‌చ్చంద్రబాబు పంపిణీ చేశారు. మండలంలోని పెదప్రోలులో స్మార్ట్‌కార్డులు పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. వీఆర్వో నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ 1,600 స్మార్ట్ రైస్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఘంటసాల: శ్రీకాకుళం విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణ నాయక్ శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం, సూరపనేనిపాలెం, వీరమాచినేనిపాలెం, అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి గ్రామాల్లో వ్యవసాయ, గృహాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

సెప్టెంబరు 13 లోక్‌అదాలత్

బంటుమిల్లి: సెప్టెంబరు 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార కమిటి చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం కాగల కేసులను కక్షిదారులతో మాట్లాడి రాజీ చేయించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్యాంబాబు, న్యాయవాదులు కే. రాంబాబు, వి. కుటుంబశాస్త్రి, టి. సురేష్, పి. పవన్, ఎస్ఐ గణేష్‌కుమార్, ట్రైనింగ్ ఎస్ఐ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనరావుకు నివాళి

దేవరకోట(ఘంటసాల): కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు తుమ్మల వెంకట జనార్ధనరావు ఆకస్మిక మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తుమ్మల వెంకట జనార్దనరావు (80) దేవరకోట గ్రామంలోని బంధువైన వైఎస్సార్ సీపీ నేత వేమూరి రాజేంద్ర ఇంటి వద్ద శుక్రవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు సమాచారం అందించారు. దేవరకోట గ్రామంలో మృతి చెందిన జనార్ధనరావు భౌతికకాయాన్ని సందర్శించిన రమేష్ బాబు స్థానిక నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కలుపు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

లంకపల్లి(ఘంటసాల): కలుపు నివారణ యాజమాన్య పద్ధతుల ద్వారానే సాధ్యమని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వరి పంటలో కలుపు యాజమాన్యం పై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. వీఏఏ దైవిక, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


పురుషోత్తమ కవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఉల్లిపాలెంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదప్రోలు(మోపిదేవి): తెలుగు భాషా, జాతీయ క్రీడా వేడుకలు మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెదప్రోలు జెడ్పీ పాఠశాలలో పాఠశాల హెచ్ఎం వెంకట రమణ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు బాషాకు, తెలుగు కవితలకు ఊపిరి పోసిన శ్రీకాకుళేశ్వరునిపై ఆంధ్ర నాయకశతకం రచించిన గ్రామానికే చెందిన శ్రీ కాసుల పురుషోత్తమ కవి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వి.సాంబశివరావు, ఎస్ఎంసీ చైర్మన్ వై.అనిత పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు కొమ్మారెడ్డి, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో శుక్రవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బి. దేవజయరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. కొమ్మారెడ్డి, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఎల్‌కేజీ, యుకేజీ చిన్నారులు గిడుగు రామ్మూర్తి పంతులు, పలువురు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు.

కోడూరు: రామ్మూరి జయంతిని తెలుగుభాష దినోత్సవాన్ని ప్రకటించడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ దివిసీమ–కోడూరు ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే ఉల్లిపాలెంలో నెలకొల్పిన 27 అడుగుల అతిపెద్ద తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ మండలాధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కోస్తా -రాస్తా, రైల్వే మార్గం ఉద్యమకారుడు కొక్కిలిగడ్డ మృతి


కొక్కిలిగడ్డ కోదండరామయ్య

మచిలీపట్నంటౌన్: కోస్తా జాతీయ రహదారి, మచిలీపట్నం– రేపల్లె లింకు రైల్వే మార్గం కోసం దశాబ్దాలుగా ఉద్యమిస్తున్న కొక్కిలిగడ్డ కోదండ రామయ్య (85) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కోస్తా జాతీయ రహదారి నిర్మాణం కోసం జరిగిన ఉద్యమంలో కోదండరామయ్య చురుగ్గా పాల్గొన్నారు. అలాగే మచిలీపట్నం– రేపల్లె లింకు రైలు మార్గం మంజూరు చేయాలంటూ దశాబ్దాలుగా ఆయన ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈ లింకు మార్గం కోసం కేంద్ర మంత్రులను, ఎంపీలను సైతం కలిసి పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. ఈ మార్గం నిర్మాణంతో కలిగే ప్రయోజనాలను తెలుపుతూ రూపొందించిన మ్యాప్‌ను ప్రతి ఒక్కరికీ ఆయన వివరించేవారు. కోదండ రామయ్య అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం బైపాస్ రోడ్‌లోని హిందూ స్మశాన వాటికలో నిర్వహించారు. కోదండ రామయ్య మృతదేహాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కోస్తా లింకు రైల్వే మార్గం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.

స్వామి సన్నిధిలో తహసీల్దార్ హరనాథ్

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఎం.హరనాథ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ సూపరిటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలి

పులిగడ్డ(అవనిగడ్డ): పోలీసులు సూచించిన ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేయాలని సీఐ యువకుమార్ సూచించారు. మండల పరిధిలోని పులిగడ్డలో వారధి వద్ద నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సీఐ యువకుమార్, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలో పెనుమూడి బ్రిడ్జి, కొత్తపేట రేవు, పులిగడ్డ బ్రిడ్జి, పల్లెపాలెం రేవు, దక్షిణ చిరువోలులంక రేవు, తుంగలవారిపాలెం రేవు, యడ్లంక రేవు, వేకనూరు రేవు, బందలాయిచెరువు రేవు వద్ద మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. ఇలా కాకుండా వేరే ప్రాంతాల్లో నిమజ్జనం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మచిలీపట్నంఅర్బన్: విద్యార్థులను అవమాన పరిచిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, సమర్థిస్తున్న ప్రధానోపాధ్యాయురాలిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రా సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. కొంకేపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ విద్యార్థులపై అవమానకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావుకు వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అఖండ మెహర్ నామ సంకీర్తనలు


అఖండ నామ సంకీర్తనలు ఆలపిస్తున్న బాబా భక్తులు

చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని అవతార్ మెహర్ బాబా మందిరం 60వ వార్షికోత్సవం సందర్భంగా 60 గంటల పాటు అఖండ మెహెర్ నామ సంకీర్తన సహవాస్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ నామ సంకీర్తలను శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 31వ తేదీ రాత్రి 7 గంటల వరకూ 60 గంటల పాటు నిరవధికంగా బాబావారి నామాలు జపిస్తారని ఆలయ అధ్యక్షులు చుండూరు బి.వి.ఆర్.కె. సత్యప్రసాద్ తెలిపారు. హైదరాబాద్, మెదక్, కరీంనగర్, పావుగడ, హిందూపురం, అనకాపల్లి, రాజమండ్రి, నరసరావుపేట, కొవ్వూరు, తుంగపాలెం, అవిరివల్లి, అమలాపురం, వైజాగ్, కొమరపాలెం, గుంటూరు, తాడేపల్లిగూడెం, మచిలీపట్నం, విజయవాడ, ఏలూరు, చల్లపల్లి ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలకు చెందిన బాబా ప్రేమికులు సుమారు 200 మందికి పైగా వచ్చి బాబా వారి అఖండ మెహెర్ నామ సంకీర్తన కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చెప్పారు.

మరోసారి రామలింగేశ్వరుని మండపంలోకి వరద నీరు


శ్రీరామ పాదక్షేత్రం వద్ద మండపంలోకి ప్రవేశించిన వరద


నాగాయలంక: కృష్ణానదికి ఎగువున ప్రకాశం బ్యారేజి వద్ద 3 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద నీటిని విడదల చేయడంతో నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌లో కృష్ణానది వరద ప్రవాహం పెరిగింది. వడివడిగా బంగాళాఖతం వైపు దూసుకుపోతున్న వరద ప్రవాహంతో ఘాట్ మునగడంతో కృష్ణవేణి మాత విగ్రహం దాటుకుని రామలింగేశ్వరుని మండపంలోకి వరద దూసుకొచ్చింది. వరద ఉధృతి దృష్ట్యా రెవెన్యూ అధికారులు తగు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. వినాయక విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో ఘాట్‌లో వరద నీటి మట్టం కారణంగా స్థానిక ఎస్ఐ కె.రాజేష్ హెచ్చరికలతో అప్రమత్తం చేస్తున్నారు. నది పరీవాహక లంక ప్రాంతాల్లో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలు పంచాయతీ మేకావారిపాలెం పీఏసీఎస్ సొసైటీ సభ్యులు, రైతు తోట కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం బ్యాంక్ సంక్షేమ నిధి నుంచి రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. సొసైటీ చైర్‌పర్సన్ జి.వంశీకృష్ణ చేతుల మీదుగా సహాయాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలో పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, సిఈఓ కోరుకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు


పెదప్రోలు అంకదేవర ఆలయం వద్ద గణనాథుడి విగ్రహాన్ని దర్శించుకున్న ఎస్ఐ సత్యనారాయణ


నగరంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దర్శనమిస్తున్న కరెన్సీ గణనాథుడు


కర్రసాము ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


పెడనలో వినాయకుని ప్రతిమ వద్ద కమిటీవారితో హిందూ పరిషత్ నాయకుడు కోటేశ్వరరావు

పెడన: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో మూడో రోజుకు చేరాయి. ప్రతి రోజు ఉదయం గణపతి ప్రతిమల వద్ద ఆయా ప్రాంతాలకు చెందిన దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బల్లిపర్రులో డీజేలు ఏర్పాటు చేయడంపై పోలీసులు రంగప్రవేశం చేసి తీవ్రస్థాయిలో హెచ్చరించి స్వాధీనం చేసుకున్నారు.

బంటుమిల్లి: మండల కేంద్రంలోని గాంధీ మండపం సెంటర్లో వూర సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు వార్షికంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమం 61 సంవత్సరాలు పూర్తి చేసుకుందని బాబూరావు తెలిపారు. వూర అరవింద్, సురేష్, రమేష్, నానాజీ, సుబ్రహ్మణ్యం, రవిల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో శుక్రవారం మణివర్ణన శ్రీభువనేశ్వరి అమ్మవారి సామూహిక కుంకుమ పూజ కనుల పండువగా నిర్వహించారు. సంకర్షణ భజన మండలి నిర్వాహకులు చిట్టా వాణి, బచ్చు అనసూయ నేతృత్వంలో భువనేశ్వరీ అమ్మవారి ప్రధాన పీఠం వద్ద కొల్లూరి హేమాంజనేయులు–రాధాకుమారి దంపతులచే పూజా క్రతువు జరిపారు.

పెదప్రోలు(మోపిదేవి): తమను చల్లంగా కాపాడాలని భక్తులు విఘ్నేశ్వరుడిని ఆరాధించారు. మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నెలకొల్పిన మట్టి గణనాథులకు ఆలయ వేదపండితులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెదప్రోలు గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో అంకదేవర ఆలయం వద్ద నెలకొల్పిన గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు.

మచిలీపట్నంటౌన్: గణపతి నవరాత్రి మహోత్సవంలో భాగంగా నగరంలోని పలు నవరాత్రి ఉత్సవాల పందిళ్ళలో శుక్రవారం కరెన్సీ గణనాథులు దర్శనమిచ్చారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్స్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పందిరిలో, సర్కిల్‌పేటలోని ముత్యాలమ్మ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన పందిరిలో కూడా కరెన్సీ గణనాథుడిని ఏర్పాటు చేసి పూజలు చేశారు.

కోడూరు: మెరకగౌడపాలెంలోని వినాయకుడి ఆలయం వద్ద భజన నిర్వహించారు. విశ్వనాథపల్లి, నరసింహపురం రామాలయాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద శ్రీసిద్ధిబుద్ధి సమేత వినాయకస్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

గూడూరు: కప్పలదొడ్డిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గుడివాడకు చెందిన శివజ్యోతి నృత్యాలయానికి చెందిన కళాకారుల బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. అద్భుతమైన ప్రదర్శన చేసిన కళాకారులు చూపరులను మంత్రముగ్దులను చేశారు.

ఘంటసాల: జలధీశ్వర స్వామి ఆలయ ముందు ఏర్పాటు చేసిన వినాయ విగ్రహం వద్ద నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన కర్రసాము గురువు గౌరిపర్తి వెంకటేశ్వరరావు బృందం సభ్యులు సుమారు 30 మంది ప్రదర్శించిన వివిధ రకాల కర్రసాము భక్తులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

కట్టిపడేసిన సత్యహరిశ్చంద్ర నాటకం


సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలో కళాకారులు

చల్లపల్లి: వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రధాన సెంటర్లోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో గురువారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను కట్టిపడేసింది. ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నాటకంలో వారణాసి సత్య హరిశ్చంద్రుడిగా ప్రముఖ సినీ, రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు (చల్లపల్లి), కాటిసీను హరిశ్చంద్రుడుగా దిరిశం శ్రీనివాసరావు (ఘంటసాల), చంద్రమతిగా లీలారాణి(తాడేపల్లిగూడెం), లోహితుడుగా బి.రాకేష్ (చల్లపల్లి), నక్షత్రకుడుగా పోలినాయుడు (విజయవాడ), విశ్వామిత్రుడు, కాలకౌశికుడు, వీరబాహుడిగా ఏపూరి వెంకటరావు (పొన్నూరు) నటనలో జీవించారు. నాటకాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. ఆద్యంతం ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించారు. ఆర్కెస్ట్రా మేడా కృష్ణా అండ్ పార్టీ ఆర్కెస్ట్రాగా, డ్రస్సు సుబ్బయ్య, లైటింగ్ గోపి, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

విద్యార్థుల ఫిర్యాదుతో ఉపాధ్యాయురాలిపై విచారణ


కొంకేపూడి జెడ్పీ హెచ్ఎస్‌లో విచారణ నిర్వహిస్తున్న ఎంఈవో సలోమి

పెడన: మండల పరిధిలోని కొంకేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఎంఈఓ–1 ఎన్ సలోమి విచారణ నిర్వహించారు. తొమ్మిదో తరగతి ఫిజికల్ సైన్స్ టీచర్ వరలక్ష్మి నిత్యం వేధింపులకు గురిచేయడమే కాకుండా తిడుతుందని హెచ్ఎం శ్రీదేవికి విద్యార్థులు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం కూడా సైతం ఆ ఉపాధ్యాయురాలికి వత్తాసు పలకడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి హెచ్ఎంతో వాగ్వాదానికి దిగారు. ఇష్టానుసారంగా తిట్టడం వల్ల విద్యార్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఎస్సీ విద్యార్థులను ఇష్టానుసారంగా టీచర్ తిట్టడంపై వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. దీంతో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెడన ఎంఈఓ–1 సలోమి పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్ దావు బైరవలింగం, దళిత సంఘ నాయకులు జక్కుల అనంద్ బాబు తదితరులు పాఠశాలకు చేరుకున్నారు. ఎంఈవో సలోమి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విచారణ పూర్తి చేశారు. పాఠశాలలో 11 మంది ఉపాధ్యాయులు, 97 మంది విద్యార్థులు ఉన్నారని, పది మంది టీచర్లపై లేని ఫిర్యాదు ఒకే ఒక ఫిజికల్ సైన్స్ టీచర్ వరలక్ష్మి పైనే విద్యార్థులంతా ఫిర్యాదు చేయడం పట్ల ఎంఈఓ ఆ టీచర్‌ను హెచ్చరించారు. సర్పంచ్ దావు బైరవలింగం కూడా మరోసారి ఇటువంటి పరిస్థితి వస్తే ఊరుకోబోమని, పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇటువంటి పొరబాటు మళ్లీ చేయనని ఆ టీచరు వరలక్ష్మి విచారణ సమయంలో క్షమాపణ కోరడంతో గొడవ సద్దుమణిగింది.

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళి


బహుమతులు అందుకున్న విజేతలతో కళాశాల కరస్పాండెంట్ తదితరులు

పెడన: శ్రీ వాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వ్యాయమ ఉపాధ్యాయులు శ్రవణం రామకృష్ణ పరమహంస, రమేష్ ఆధ్వర్యంలో కళాశాలలో క్రికెట్, వాలీబాల్, షటిల్, టెన్నీకాయిట్, ఖోఖో, చెస్, క్యారమ్స్ మొదలయిన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. తొలుత జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చివరగా క్రీడాపోటీల్లో విజేతలకు కళాశాల కరెస్పాండంట్ కాకి కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోనపాటి బాబా, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రాజా రమేష్, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేజీవీఎస్ నాగేశ్వరావు తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ సెల్ కోఆర్డినేటర్ చలమలశెట్టి గిరిఫణికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్– హెచ్.ఓ.డి. సివిల్ ఇంజనీరింగ్ తదితర విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిగిన వరద

మరింత కోతకు గురవుతున్న ఎడ్లంక


పులిగడ్డ అక్విడెక్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

అవనిగడ్డ: దివిసీమకు వరద ఉధృతి పెరిగింది. గురువారం సాయంత్రం వదిలిన వరద నీరు దివిసీమకు చేరుకోవడంతో పులిగడ్డ వద్ద 16 అడుగుల మేర వరద ప్రవహిస్తుంది. అక్విడెక్టును తాకుతూ వరద కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది. మండల పరిధిలోని ఎడ్లంక చుట్టూ వరద నీరు చేరింది. ఎడ్లంక ప్రాంతం మరింత కోతకు గురవుతుంది. దీంతో నది పక్కనున్న వారు ఇళ్లను ఖాళీ చేసి పంచాయితీ భవనం, బంధువుల ఇళ్లలో తలదాచు కుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎడ్లంక కోతకు గురవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి అవకాశాలు

డీఎస్పీ విద్యశ్రీ


క్రీడాజ్యోతితో డీఎస్పీ విద్యశ్రీ

అవనిగడ్డ: విద్యతో పాటు క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని డీఎస్పీ టి.విద్యశ్రీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ విద్యశ్రీ, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ భారీ జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. డీఎస్పీ విద్యశ్రీ క్రీడాజ్యోతిని వెలిగించి కొద్దిదూరం తీసుకెళ్లారు. అనంతరం పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఈ జ్యోతిని ర్యాలీగా ముందుకు సాగారు. కోడూరు మండలం వి కొత్తపాలెంలో ఇటీవల నిర్వహించిన సబ్‌జోన్ ఆటలు, క్రీడల పోటీల్లో విజేతలకు డీఎస్పీ విద్యశ్రీ, వెంకట్రామ్ బహుమతులు అందించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో వనజ కుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి, హైస్కూల్ హెచ్ఎం కందుల సుజాత, పులిగడ్డ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ముస్లింలకు అవమానం

మచిలీపట్నంటౌన్: నగరంలో ప్రతి సంవత్సరం హిందూ, ముస్లిం పండుగల సందర్భంగా మతసామరస్యం వెల్లివిరుస్తూ వస్తోంది. ఈ ఏడాది కూడా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలోనే సెప్టెంబర్ 5న మిలాద్ ఉన్ నబి పర్వదినం నిర్వహించుకునేందుకు నగరంలోని ముస్లింలు సన్నద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఎప్పటిలానే ఈ ఏడాది కూడా ప్రధాన రహదారిలోని సెంటర్ డివైడర్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలకు ముస్లింలు మహమ్మద్ ప్రవక్తను స్మరిస్తూ బోర్డులు, జెండాలు కట్టారు. అయితే సెప్టెంబర్ నాలుగో తేదీన నిమజ్జన కార్యక్రమం ఉందనే కారణంతో వీటిని మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు రాత్రికి రాత్రే తొలగించారు.

తెలుగు వల్లభా మన్నించు !


కాకుళేశ్వర దేవస్థాన ప్రాంగణంలో బోసిపోయిన శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం

దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పిన తెలుగుభాషా వల్లభుడు, కవి సార్వభౌముడు శ్రీకృష్ణ దేవరాయుల వారిని తెలుగు భాషాభిమానులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో తెలుగు వల్లభా మన్నించు అంటూ... పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఘంటసాల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాల్లో కానీ తెలుగుభాషా దినోత్సవం నిర్వహించకపోవడంపై భాషాభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. – శ్రీకాకుళం(ఘంటసాల)